# సంధ్యావందన మహాత్మ్యం

సినీమాకి బయలుదేరేటప్పటికి తనూ సహగమనం చేస్తానంది మా ఆవిడ. కొత్త సినీమాకి చాలా రష్‌గా వుందికనక ఏదో చెత్త సినీమాకి వెడుతున్నాను, అందుచేత శిక్ష తప్పించమని ప్రాధేయపడ్డాను. ససేమిరా అంది. సరే రా అన్నాను.

బస్సు ఎక్కేం. బస్సు బయల్దేరేముందు పరిగెత్తుకుంటూ వొచ్చి రింగు పట్టుకుని ఒంటికాలుమీద నిలబడ్డ నన్ను ఢీ కొట్టినంత పనిజేసిం దో అమ్మాయి. మచ్చలేని సినిమా చంద్రబింబంలాంటి ఆ అమ్మాయి మొహంలోకి సూటిగా చూసేటప్పటికి కళ్ళు చీకట్లు కమ్మాయి. 'నమస్కారమండి' అని ఆ అమ్మాయనగానే వొళ్ళు తిమ్మిరెక్కినట్టయింది. దూరంగా కూర్చున్న మా ఆవిడ చురుకూ చురుకూ, తారాజువ్వలాంటి రెండు చూపులు విసిరింది. కంగారులో ప్రతి నమస్కారంకూడా చెయ్యడం మరిచిపోయేను.

దురదృష్టానికికూడా హద్దూ పద్దూ వుండాలి. ఇలాంటి సంఘటన బస్సులోనేజరగలా? అందులోనూ మా ఆవిడ సమక్షంలో? ఇంతలోకే మునిగిపోయినట్టు, కండక్టరాసురుడు పెద్ద విప్లవ వాదిలాగ. గొంతు చించుకుంటూ 'ఆగే బడో ఆగే బడో' అంటూ ఆ అమ్మాయిని వెనక్కీ, నన్ను ముందు గుంపులోకీ నెట్టేశాడు. కాస్సేపటికి సీట్లు ఖాళీ అవగానే మా ఆవిడ పక్కన నేను కూర్చుంటే, గోరుచుట్టుమీద రోకలి పోటులాగ ఆ అమ్మాయి ప్రక్కన మొహం మీద పడే జుట్టూ, మెళ్ళో గళ్ళ జేబురుమాలూ, డ్రెయినేజ్ గొట్టాల ఫేషన్‌లా పంట్లామూ, దువ్వెన్నలోంచి తీసి పారేసిన చిక్కుపడిన వెంట్రుకల డిజైన్‌తో బుష్‌షర్టూ, చేతిలో ట్రాన్సిస్టర్‌తోనూ ఓ పాతికేళ్ళ రౌడీ వెధవ కూర్చున్నాడు. వాడేమైనా

వెర్రి వెర్రి వేషాలేస్తే పేగులు తోడేద్దామనుకుని వెనక్కి తిరిగేను. వెధవ పోజూ వాడూను! పక్కన మనిషి వున్నట్టు గమనించనట్టుగా ట్రాన్సిస్టర్ కౌగిలించుకుని బిగుసుకుపోయి కూర్చున్నాడు.

"ఏం, వాడి పీకె పిసిగేస్తారా?" అంటూ పరామర్శించింది మా ఆవిడ. ఏం కర్ణ పిశాచం వుందో ఏమో!

"మనం వొచ్చే స్టాప్‌లో దిగి ఎవరెస్ట్‌లో ఐస్క్రీం తిని వెడదాం" అన్నాను ధోరణి మారుద్దామన్న ఉద్దేశంతో.

"మీ విరహాగ్ని ఉపశమిస్తుందంటే, అలాగే చేద్దాం" అంది సానుభూతి ఉట్టిపడుతూ.

ఇంటర్వెల్లో రెండు సీట్లవతల యెవరో తెలుసున్న వాళ్ళుంటే అటు వెళ్ళింది మా ఆవిడ. నేను లేచి బయటకెళ్ళి సిగరెట్‌తో వూపిరి పీల్చుకుందామనుకుంటే, నేల ఈనినట్టు గబగబ వొచ్చి నా పక్క సీట్లో కూర్చుంది ఆ అమ్మాయి. సిగరెట్ మాట దేవుడెరుగును. నాకు శ్వాసే ఆగిపోయినంత పనయింది.

"ఇందాక బస్సులో మీ పక్కన కూర్చోడం, తర్వాత ఒకే స్టాప్‌లో దిగడం చూసి ఆవిడ మీ మిసెస్సేమో అనుకున్నాను. మీరొక్కరే వొచ్చేరన్న మాట! పని మీద బయల్దేరి మధ్యలో దిగి పోయేరేమో ననుకున్నాను. మొత్తం మీద మిమ్మల్ని మళ్ళీ పట్టుకున్నాను" అంది కళ్లు చక్రాల్లా తిప్పుతూ. కంఠంమీద అడ్డంగా ముచ్చటగా మ రాడు సన్నని చారలున్నాయి. ఆమె పద్మినీ జాతి స్త్రీ అనడానికేమీ సందేహం లేదు. ఎటొచ్చీ ఢాకినిలాగ నన్ను వెంటాడుతోంది. గొంతు కూడా కోకిలస్వరం, ఎటొచ్చీ సంభాషణ అపస్వరం పలుకుతోంది. ఇంతకీ పరిస్థితి విషమించక ముందే, విషయం కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేద్దామన్న ఉద్దేశంతో పెదిమలు తడిచేసుకునేలోగా, మా ఆవిడ లేచొచ్చి నా పక్కన కూర్చుంది. తడబడే మాటల్తో "ఈవిడే మా ఆవిడ" అంటూ, అప్పటికే తనువెల్లా భాస్వరంలాగా మండిపోతున్న నా ముప్పాతికాంగిని పరిచయం చేశాను.

"అదేమిటండీ. మీరొక్కరే వొచ్చారా అంటే, ఊఁ అన్నారు, ఈవిడ మీ మిసెస్సా అంటే కాదన్నారు. మంచి తమాషా అయిన వారే!" అంది నాకళ్ళ

తిరిగేలాగా తన కళ్ళు తిప్పుతూ. నా నోరు పెగలకపోతే, తను వూహించి వాటికన్నీ నేనా బాధ్యుణ్ణి?!

''ఆయన కిలాంటి విషయాల్లో వొళ్ళు పై తెలీదు, అసలే మతిమరుపు మనిషి కూడాను. ఆయనకి పెళ్ళి కూడా అవలేదని చెప్పేరా? చెప్పే వుంటారు'' అంది మా ఆవిడ.

''అబ్బెబ్బే! ఆయనకి పెళ్ళయిందని నాకు తెలుసండి.''

''ఓహో! నీకలాంటి పట్టింపు లేదన్నమాట! ఏమిటమ్మా నీ పేరు?''

''సంధ్య.''

''బాగుందమ్మా! ముచ్చటైన పేరు. ఇంతకీ నీకు ఈయనతో....''

సమయానికి లైట్లారిపోయాయి. ఆట మొదలవుతుంది. మా ఆవిడ నోటి కడ్డంగా నా జేబురుమ్మాలదిమిపెట్టి ''చూడు. మిస్ సంధ్యా! యీ సీట్లో ఇందాక కూర్చున్నాయ నదుగో వస్తున్నాడు. వెళ్ళి నీ సీట్లో కూర్చో'' అన్నాను, అడ్డంగా కోతకోస్తూ.

"రే పొద్దున్నే మీ యింటికొస్తానండి" అంది సంధ్య వినయంగా.

"మా యిల్లుకూడా తెలుసునా?!" అడిగింది మా ఆవిడ, నా చెయ్యి తప్పించుకుంటూ.

''తెలుసండీ!" అంది లేస్తూ.

''నువ్వెందుకూ రావడం? మీ తాలూకు వాళ్ళెవరూ లేరూ?" అంటుంటే మా ఆవిడ మాటలు వడమాతుపులాగ నా మొహానికి తగిలేయి.

"మా అన్నయ్యున్నాడండి!" అంది ఆ అమ్మాయి, మృదుమధుర కంఠంతో వెన్నెల జల్లులాగ.

"నా బంగారు తల్లే! రేపోసారి నన్ను కలుసుకోమని చెప్పమ్మా!" అన్నప్పుడు మా ఆవిడ కళ్ళు ఆ చీకట్లో, డేంజర్ లైట్లులాగ మెరిసిపోయాయి.

"అలాగేనండి. శలవు" అంటూ మెరుపు తీగలాగ మాయమయ్యింది, నన్ను మా ఆవిడ కోపాంధకారంలో దిగవిడిచి.

ఆ అమ్మాయి వెళ్ళిపోయాక, సినిమాలో ఆడవిలన్‌లాగ మా ఆవిడ నా వైపు తిరిగి ఓ విషపు నవ్వు విసిరింది. సినిమా మళ్ళీ మొదలయ్యిందన్న మాటే కాని యన్టీ రామారావూ సావిత్రీ ఓ లాగే కనబడుతున్నారు. మా ఆవిడ విషపు నగుమోము మేఘాకృతిలో నా మనస్సు నావరించిందేమో కథ కూడా మరచి పోయాను. అదే సమయానికి 'నేనింటికి పోతున్నా' నంటూ మా ఆవిడ లేచింది. టపటప నా ఎడం కన్నదిరింది. 'సినీమా అయ్యేక వెడదాం' అన్నాను చెయ్యి పట్టుకుని బలవంతంగా కూర్చోబెడుతూ.

"ఏమే మవ్వాలో అవన్నీ అయ్యేక, యిల్లు జ్ఞాపక మొచ్చినపుడే రండి. చూసిన సినిమా చాలు" అంటూ నా చెయ్యి విదిలించుకు లేచింది. అదే సమయానికి, రెండు వరసలవతల్నుంచి డొమ్మని తుమ్మేదో అపశకునపక్షి. బయటకొస్తూ వాడికేసి పరకాయించి చూశాను. వాడిందాకటి డ్రెయినేజ్....మెళ్ళో గళ్ళరుమాల ....ట్రాన్సిస్టర్....వెంట్రుక....గాడు. ఆ అమ్మాయీ, వీడూ కలిసి ఈ నాటక మాడుతున్నారా అన్న అనుమానం కలిగింది. ఇలా ఓ ఆడదీ మొగాడూ కలిసి వచ్చటి సంసారాల్లో చిచ్చు పెట్టే వృత్తిని చాలా సినీమాల్లోనూ, నవలల్లోనూ ప్రోత్సహించడం చూస్తున్నాం. ఈ రౌడీ వెధవ నేను లేకుండాచూసి, యింట్లో జొరబడి మా ఆవిణ్ణేమీ అల్లరిపెట్టి,డబ్బు గుంజుకోడు కదా!ఇలా మనస్సు పరిపరి విధాల పోతుంటే, యాంత్రికంగా మా ఆవిడ వెనకాలే బస్సు ఎక్కుతూ, దిగుతూ, అడుగుల్లో అడుగు లేసుకుంటూ ఇల్లు చేరేను.

ఇంటికెళ్ళేక ద్విగుణీకృత నూతనోత్సాహంతో, కజ్జాకి కాలుదువ్వడం ప్రారంభించింది మా ఆవిడ.

''సినిమాకి రావద్దంటే ఏమిటో అనుకున్నాను. కూడా రాబట్టి మీ రంగు బయటపడింది. ఈ నాటకం ఎన్నాళ్ళనుంచి జరుగుతోందో!" అంటూ నాంది ప్రస్తావన చేసింది.

"మాటి మాటికి అమాటే అనొద్దంట. ఆ అమ్మా యెవరో నాకు తెలీదు."

''అవును, పాపం! ఏమీ తెలీదు, మిమ్మల్ని తొలి చూపులోనే ప్రేమించి వెంటపడింది....ఎవరో చెప్పండా అమ్మాయి?"

''ఆ అమ్మాయెవరో నాకు నిజంగా తెలీదు.''

''ప్చ్. ప్చ్. తెలియకేంగాని, మరిచిపోయుంటారు. జ్ఞాపకం వుండి వుండదు. ఇలాంటి వ్యాపకాలెన్నాళ్ళబట్టి ఎన్నున్నాయో మరి.''

''ఆ అమ్మాయి నన్ను చూసి ఎవరనుకుందో!''

''మనిషిని పోలిన మనుషులుండటం విన్నానుకాని, ఫలానా రోజున, ఫలానా ఇంట్లోంచి ఫలానా బస్సెక్కి ఫలానా సినిమాకెళ్ళే ఒకేరకం యిద్దరు మనుషులుంటారని వినడం యిదే మొదటిసారి.''

"చూడు, నిజంగా ఆ అమ్మాయితో సినిమా కెళ్ళాలనుకుంటే, నిన్ను కూడా తీసుకెళ్ళేవాణ్ణా?''

"ఆ మాత్రం మీకు తెలియదని కాదు. ఆ ప్రయత్నమూ చేశారు, నేను వద్దన్నా వెంటబడ్డాను."

"పోనీ, నేను కూడా మానెయ్యొచ్చుగా, యీ గొడవంతా లేకుండా ..."

''అదేం కట్టుకున్న భార్యకనకనా వస్తాననీ మానేస్తే వూరుకోడానికి! ప్రియురాలుకదా! మీకు మాత్రం ప్రాణం పీకదూ!"

"ఈ విషయంలో నీకున్న అనుభవం నాకు లేదు. ఎలాగైనా ప్రేమంటే ఏమిటో చవి చూసినదానివి ఆ జగన్నాథరావు నిన్ను పెళ్ళాడ ననగానే మంచం ఎక్కావు."

"అవన్నీ పెళ్ళికాని క్రితం. పెళ్ళయ్యేక ఆత్మగౌరం వున్నవాళ్లెవరూ యిలా ప్రవర్తించరు. అసలు మిమ్మల్నన్నేం లాభం? ఆ అమ్మాయికి బుద్ధుండాలి ఏమిటో! మీలాంటి వాళ్ళను కూడా ఆడాళ్ళు ప్రేమిస్తారన్న విషయం వూహించ లేకపోయాను.''

''నాలాంటి వాళ్ళంటే! ఏం! నాకేం తక్కువ! ఆడది ప్రేమించాలంటే, మొగాడు జగన్నాథరావులా గుండాలేమో!''

''మీ దగుల్బాజీ వ్యవహారాల్లో అతని పేరు తీసుకొచ్చి అపవిత్రం చెయ్యకండి''

''నిన్ను ప్రేమించి మరొకర్తిని పెళ్ళాడ్డంలోనే కనబడుతుంది, అతని పవిత్రత.''

"వంకలేనమ్మ డొంకట్టు కేడ్చిందట! అలా వుంది మీ వరస. మీ బండారం బయటపడిందికదా అన్న ఉక్రోషంతో, ఏవో కల్లబొల్లి కథలల్లి నా నోరు నొక్కుదామని చూస్తున్నారేమో! అసలు మీ రిలాంటి మనిషని తెలిస్తే...."

"ఊఁ... తెలుస్తే! ఏం చేసేదానివి! నన్ను పెళ్లాడ్డం మానేసి, ఆ జగన్నాథరావును తల్చుకుంటూ, అజన్మ బ్రహ్మచారిణిగా వుండిపోదువేమో! ఇప్పుడైతేనేం! నన్నొదిలేసి...."

"ఇదన్నమాట మీ మనస్సులో కోరిక! నన్నొదుల్చుకోదలుచుకుంటే.... ఇంతకంటే మంచి మార్గం లేదూ...." అంది అమృతాంజనం డబ్బా అందుకుంటూ.

మహా ప్రభో! భగవంతుడా! ఈ స్త్రీని ఈ భూమ్మీద ఎందుకు సృష్టించేవు? మొగ మానవుడి మీద నీ కెందుకింత నిర్దయ! ఇవ్వాళ జరిగిన ఈ సంఘటనలో మనసా, వాచా, కర్మణా, నా దోషమేమైనావుంటే నన్ను తుపాకితో కాల్చెయ్యి. అంతేకాని, నన్నిలా చిత్రవధ చెయ్యకు....అనుకుంటూ పుట్టెడు దుఃఖంతో 'లేజీచైర్'లో కూలబడ్డాను. ఇంతలోకే రేడియోలో రంగవల్లి స్త్రీల కార్యక్రమం బుసకొడుతూ వినబడుతోంది. అఖిల భారత కళాకారిణుల సమావేశంలో అంతర్జాతీయ మహిళోద్ధరణోద్యమ సంఘాధ్యక్షురాలైన శ్రీమతి (పేరు జ్ఞాపకం లేదు) గారు, నేటి జాతీయ అత్యవసర పరిస్థితిలో వనితల కర్తవ్యాన్ని గురించి ఉద్ఘాటించిన చిట్కాలూ, తర్వాత భర్తల దౌర్జన్యాలూ భార్యల దౌర్భాగ్యాలూ అనే అంశంమీద ఒక కన్నీటి కథనం, తదుపరి పిల్లల్ని కనడానికి, వాళ్ళని పెంచడానికి సులభ మార్గాలూ, పిమ్మట అరటికాయతో అప్పడాలూ, వంకాయితో వడియాలూ, బీరకాయతో వొరుగులూ చేసే విధానం, అటుపైన జాతీయ పొదుపు ఉద్యమం, పాతబట్టలూ, స్టెయిన్లెస్‌స్టీల్ పాత్రలలో స్త్రీల పాత్రలపై ఒక లఘు ఉపన్యాసం, ఆఖరున మంగళం-అది వింటుంటే వొళ్ళంతా ఏవో పొగలూ ఆవిరులూ వొస్తున్నట్టు కనబడి, చల్లగాలి కోసం బయటకి పోయాను.

*　　*　　*

అత్తారంటూ వుండటం మంచిదికాదనను కాని, దగ్గరగా వుండటం దురదృష్టం. ఇంక మరీ మాకులాగ, మేము హైద్రాబాద్‌లో వుంటే అత్తారు సికింద్రా

బాద్‌లో వుంటూ, ఫోన్ ఎత్తేటప్పటికి పాత గ్రామఫోన్ రికార్డులాగ. అమ్మాయి నామసంకీర్తనా పారాయణం వినబడటం దుర్భరం! ఘోరం! కారణమేమిటంటే, ఛాతీ విరుచుకు తిరిగే యీ మొగుడనేవాడికి వ్యక్తిగత స్వాతంత్ర్యం అంత రిస్తుంది. అనుక్షణం వాడి వెనకాలే అత్తమామల దివ్యదృష్టి వెంటాడుతూ వుంటుంది 'ఏమిటోయ్, ఈ మధ్య రాత్రిళ్ళు మరీ ఆలస్యంగా వొస్తున్నావుట యింటికి?' అనే మామగారి మృదువైన మందలింపో, 'బాబూ! మరీ అర్ధరాత్రి వరకూ తీరని పనులున్న రోజున అమ్మాయి నిక్కడ దిగబెట్టి వెడుతూవుండు. అసలే దానికి భయం' అనే అత్తగారి సన్నాయి నొక్కో, 'ఏమిటి బావగారూ! మొన్ననో స్నేహితుడితో 'లిడో'లో విస్కీ తీసుకుంటూ కనబడ్డారుట! నిన్న సాయంత్రం 'క్వాలిటీ'లో బ్రాందీ ఆనంద తన్మయత్వంలో దర్శనమిచ్చేరుట! ఇవ్వాళ ఎక్కడ మధుపాన వేదపారాయణా కాలక్షేపం?' అనే బావమరది పరామర్శో టెలిఫోన్‌లో మధ్య మధ్య వినబడటం తథ్యం.

ఇంతకీ అసలు విషయ మేమిటంటే, పొద్దున్నే టెలిఫోన్‌లో మా బావ గొంతు వినబడగానే ఇదేదో ప్రళయానికి ఉపోద్ఘాతంగా గ్రహించేను. ఎంచేతంటే, నిన్నటి సంఘటన సందర్భంలో, నిన్న రాత్రి, మా అత్తారికి మా అవిడకి మధ్య టెలిఫోన్ రాయబారం జరిగిందన్నమాట!

"గుడ్‌మార్నింగ్ బావగారూ! ఈ మధ్య చాలా 'బిజీగా వుంటున్నట్టు న్నారు. బొత్తిగా దర్శనాల్లేవు!" అంది మా బావమరది గొంతు.

"ఏం! బెంగెట్టుకున్నావా! చెప్పు. నెల్లాళ్ళపాటు మీ యింట్లో వుండి వెళతాం.''

"ఆ....నిజంగా వొచ్చేవాళ్ళకేనా చెల్లదు. మా సిస్టర్ కులాసాగా వుందా?"

''ఉండు చూసి చెప్తా" అంటూ రిసీవర్ కింద పెట్టబోతూంటే మా బావ మరది గిలగిలారావం వినబడింది.

"ఏమిటి పొద్దున్నే నీ ఆర్తనాదం!" అన్నాను.

"నీతో మాట్లాడాలి."

"సరే, మాట్లాడు.''

"రహస్యంగా మాట్లాడాలి- చాలా ముఖ్యమయిన విషయం."

"ఎవరికి ముఖ్యం?" అడిగేను.

''నీకూ, నాకూ, మనందరికీ సంబంధించిన విషయం."

"నాకు సంబంధించినంతవరకు నీతో మాట్లాడే ముఖ్య విషయాలేమీ లేవు. మీ చెల్లెలితో మాట్లాడు. వుండు పిలుస్తా!''

"బావా! బావా! నీకు పుణ్యం వుంటుంది. రిసీవర్ దించెయ్యకు. నీతో మాట్లాడాలి. ఇది నా జీవితానికే ఓ పరీక్ష.''

''ఏమిటి! నాతో మాట్లాడటమా!''

''ముఖ్యమైన విషయం.''

''అంత ముఖ్యమైన విషయంలో నేను నీకు యిచ్చే సలహా ఏముంటుంది? మీ నాన్నగారితో మాట్లాడు.''

''అబ్బెబ్బె! ఆయనతో మాట్లాడేదేమీ లేదు. నీతోనే మాట్లాడాలి. ఆ మాట కొస్తే, ఆయన చెబితేనే నీతో మాట్లాడుతున్నాను.''

''అయితే, మనిద్దరం ఓ షరతు పెట్టుకుందాం'' అన్నాను.

''ఓ యస్. చెప్పు.''

''చూడూ! నా అంతరంగిక విషయాల్లో ఇతరులు కలగజేసుకోడం నాకు నచ్చదు. నా బాగోగులు నాకు తెలుసు ఒకళ్ళు చెప్పినా వినను."

"అవునుట. రాజ్యం (మా ఆవిడ) చాలాసార్లు చెప్పింది.''

''మీ సిస్టర్‌కి తెలిసిన విషయాలే చెప్పి వుంటుంది. మీ సిస్టర్, ఉరఫ్ మా ఆవిడకి తెలియని విషయాలు చాలా ఉన్నాయి.''

"వుంటాయి మరి. మొగాడన్న తర్వాత....''

"కరెక్టు. జీవితాన్ని విశాల దృష్టితో చూసేవాడికి ప్రపంచమంతా సహజంగాచూ సమంజసంగానూ కనబడుతుంది."

"నీ విశాల హృదయం గురించి వివరాలు తర్వాత వింటాను. ముందు షరతు సంగతి చెప్పు."

"అదే చెబుతున్నా, మనం ఒకళ్ళకొకళ్ళు చెప్పుకునే రహస్యాలు ప్రాణం పోయినా ఇంకొకళ్ళకి చెప్పకూడదు. ఎవరైనాసరే, ఏం?!'' అన్నాను ముందరి కాళ్ళకి బంధంవేసే ధోరణిలో.

"అఁ! అంత పెద్ద రహస్యాలేముంటాయిలే!"

"నా విషయం నేను చెబుతున్నాను రహస్యాలు బయటపడ్డందువల్ల ఎన్నో సంసారాలు నాశనమవుతున్నాయి. రహస్యాలు రహస్యాలుగానే వుండిపోతే అలాంటి ప్రమాదం జరగదు. ఏమంటావు?''

''నీ మాటలు వింటుంటే చమటలు పడుతున్నాయి. అయితే, సాయంత్రం ఆరుగంటలకల్లా 'ఒయాసిస్'లో కల్సుకుందాం. ఏమంటావ్?"

''నీ యిష్టం. మరి నాకు 'స్కాచ్‌విస్కీ' తప్ప పడటం లేదు'' అన్నాను, గుమ్మంలో నిలబడి కర్ణానందంగా వింటున్న మా ఆవిణ్ణి చూడనట్టు నటిస్తూ.

''అంత గట్టిగా అనకు. రాజ్యానికి వినపడగలదు'' అన్నాడు.

ఓసారి గంభీరంగా మా ఆవిడ మొహంలో దైన్యంకేసి చూసి, మనస్సులోనే మీసం మెలేసుకున్నాను. "నా లాంటి మొగాళ్ళనుకూడా ఆడాళ్ళు ప్రేమిం స్తారని ఊహించలేక పోయిందిట! ఈ దెబ్బతో ఓ పాఠం నేర్పుతాను. కాళ్ళ బేరాని కొచ్చేలాగ చేస్తాను'' అనుకున్నాను, రాబోవు దృశ్యం నా మనో నేత్రాలతో తిలకిస్తూ.

* * *

సాయంత్రం, మాట ప్రకారం మా బావని 'ఒయాసిస్'లో కల్సుకున్నాను నే ధరించవలసిన పాత్ర అప్పటికే నాలుగుసార్లు రిహార్సిల్ వేసుకున్నాన్నా. ఎంచేతంటే, మా బావ అడగబోయే ప్రశ్నలు నే నూహించలేనివి కావు. నిన్నటి సంఘటన గురించి మా ఆవిడ ద్వారా విన్న తర్వాత జరిగిన వాళ్ళ కుటుంబ సమావేశంలో వాదోపవాదాలు జరిగి వుంటాయి తత్ఫలితంగా మా అత్తమామల సలహా ననుసరించి, సామ దాన భేద దండోపాయాలతో నన్ను పునరుద్ధరించ డానికి మా బావమరిదిగా ఏర్పాటు చేసిన మహత్తర సమావేశమిది అయివుంటుం దనుకోడానికి సందేహమేది?

కాస్సేపు కుశల ప్రశ్నలూ, అటుపైన ఆ మాటా ఈ మాటా అయిన తర్వాత కదనరంగంలో ప్రవేశిస్తూ మా బావమరిది పెద్ద డిటెక్టివ్‌లాగ మొహం పెట్టి, సుదీర్ఘమైన ఓ సిగరెట్ దమ్ములాగి, డైరీలోంచి జాగ్రత్తగా ఓ ఫోటో బయటికి తీసి బోర్లించి, నావైపునెట్టి "ఈ ఫోటో చూడు" అన్నాడు నా మొహం లోకి పరీక్షగా చూస్తూ. ఫోటో చూశాను. అది నిన్నటి సంధ్య ఫోటో. వెంటనే నా మొహం నల్లబడిపోయి, వణికే చేతుల్తో అతని చేతులు పట్టుకుని, బొంగురు పోయిన గొంతుకతో "క్షమించు బావా!" అంటా ననుకున్నట్టున్నాడు.

నేను కూడా ఊపిరితిత్తుల్ని నాభి వరకూ సాచి ఓ బ్రహ్మాండమైన సిగరెట్ దమ్ములాగి, నోటమ్మటా ముక్కుమ్మటా పొగలు కురిపిస్తూ అన్నాను.

"అల్ రైట్. ఈ విషయం నీకూ తెలిసిపోయిందన్నమాట! ఇంక భయమెందుకూ! నిజం చెప్పేస్తాను. నేనూ ఆ అమ్మాయి ప్రేమించుకున్నాం."

"బావా!" అన్నాడు గద్గదంగా, నా ఆగ్నేయాస్త్రానికి కుదేలయ్యి.

"ఇష్! అంత గట్టిగా అరవకు పదిమందీ వచ్చేచోటు. అంత ఆవేశం పనికిరాదు. మానవజీవితంలో ఇలాంటి సంఘటనలు సామాన్యం. సంవత్సరం నుంచీ ఎవరికంటా పడకుండా కాలక్షేపం చేశాం. నాకు పెళ్ళయిందని ఆ అమ్మాయికి తెలుసు. ఆ అమ్మాయిని పెళ్ళాడటం అసంభవమని నాకు తెలుసు. అయినప్పటికీ బలవత్తరమైన ప్రేమబంధం అలాంటిది."

"ఆ అమ్మాయెవరో తెలుసా?"

"సంధ్య- చక్కటి రూపం, రూపానికి తగ్గ గుణం. నవనీతం లాంటి హృదయం."

"బావా!" మళ్ళీ ఆర్తనాదం.

"ఓయ్!"

"నిజంగా నువ్వూ ఆ అమ్మాయీ ప్రేమించుకున్నారా? ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందా?"

ఈ ప్రశ్న సరిగ్గా పీడి చెల్లెలి ధోరణిలోనే ఉంది. నే నా అమ్మాయిని ప్రేమించడం కంటే, ఆ అమ్మాయి నన్ను ప్రేమించడం చాలా ఆశ్చర్యంగా ఉన్నట్టుంది వీళ్ళకు! ఏ ఆడదీ నన్ను ప్రేమించదని ఏమిటో వీళ్ళ ధీమా! "మీలాంటి వాళ్ళను కూడా ఆడాళ్ళు ప్రేమిస్తారని ఊహించలేకపోయాను"....ట!

"ఏం, ఆ అమ్మాయి నన్ను ప్రేమించడం ప్రకృతి విరుద్ధంగా తోచిందా?"

"ఎంతమంది హృదయాల్లో చిచ్చుపెడుతున్నావో తెలుసా?''

"రెండూ ప్లస్ రెండు నీ హృదయంతో వెరసి ఐదు."

"ఆ అమ్మాయి భవిష్యత్తును గురించి ఆలోచించావా?"

"ప్రేమ అన్నది రెండు హృదయాలకి సంబంధించిన అనుబంధం. వ్యాపారం కాదు లాభనష్టాలాలోచించడానికి. అయినప్పటికీ ఆ అమ్మాయి భవి

తవ్యం గురించీ, కర్తవ్యం గురించీ సలహాలిస్తూనే వున్నాను. ఈ అనుభవంతో మరో బుద్ధిమంతుడైన యువకుణ్ణెవణ్ణయినా ప్రేమించి, పెళ్ళాడి సుఖపడమన్నాను. ప్రయత్నిస్తానని ఒప్పుకుంది. ఏమయినా కొంచెం టయిమ్పట్టే వ్యవహారం కదా!"

"నువ్వింత రాక్షసుడి వనుకోలేదు. ఇటు మా చెల్లి జీవితం...."

"చూడు బావా! నీకు ముందరే చెప్పేను, రహస్యం రహస్యంగానే వుండాలని. ఇప్పుడు మీ చెల్లెలి కొచ్చిన లోటేమిటి? ఎటొచ్చీ తెలుస్తే బాధ పడుతుంది. తెలియకుండా వుంచుదాం. అథవా తెలిసినా మొదట్లోవున్న దుఃఖం రాను రాను అలవాటయిపోయి అంత ఉధృతంగా వుండదు. ఈలోగా నాకే పశ్చాత్తాపం రావచ్చు" అన్నాను తాపీగా.

"కథ యింతవరకూ వొచ్చిందన్నమాట! ఉండు. ఆ సంధ్యని రేపు నీ యింటి కీడ్చుకొచ్చి...."

"ఆగు. అలాంటి వెర్రి మొర్రి వేషాలేశావంటే కథ చాలా దూరం వెడుతుంది. ప్రొద్దున్న నా షరతు ఒప్పుకున్న మీదటే ఈ రహస్యం బయట పెట్టేను. ఆ మాటకొస్తే, మా ఆవిడ పెళ్ళికాని క్రితం జగన్నాథరావుని ప్రేమించిందిట. తర్వాత నన్ను పెళ్ళాడింది. జగన్నాథరావు మరో అమ్మాయిని పెళ్ళాడేడు. ఇప్ప డింకా మా ఆవిడా జగన్నాథరావూ ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నారో లేదో నాకేం తెలుసు! తెలుసుకోవాలని ఎప్పుడూ ప్రయత్నమైనా చెయ్యలేదు. ఎప్పుడైనా ఆ మాటెత్తేనా?"

"ఇప్పు డెత్తేవుగా! హఁ, నువ్వూహించినంత నీచ సంబంధమేమీలేదు వాళ్ళిద్దరి మధ్యా. చిన్నప్పట్నుంచీ నేనూ జగన్నాథరావూ క్లాస్మేట్సూ, ప్రాణ స్నేహితులమూను.మా పెద్దలకీ వాళ్ళ పెద్దలకీమధ్య వాళ్ళ పెళ్ళి మాటలు జరిగేయి. నిజమే. అయితే, అతను పరిస్థితుల ప్రభావంవల్ల ఓ దిక్కులేని వితంతువుని పెళ్ళి చేసుకున్నాడు. అతను స్వార్థ త్యాగి, ఆత్మాభిమాని. అందుకే, నేనూ రాజ్యం కూడా అతన్ని ఓ ఆదర్శ పురుషునిగా ఆరాధిస్తాం."

"అంచేతనే ప్రేమ గుడ్డిదన్నారు. కష్టపడి మా ఆవిణ్ణి ప్రేమించి, చివరకి మరొకత్తిని కట్టుకున్నాడు. అలాగే నేనొకత్తిని పెళ్ళాడి మరొకత్తిని ప్రేమిస్తున్నాను. అందుకే యిలాంటి వ్యవహారాలలో మంచి చెడ్డలు విమర్శించటంకంటే ఇది మానవ నైజం అని సరిపెట్టుకోడం మంచిది."

"ఇప్పుడు నా కర్థమయింది నీ ప్రేమలో అంతర్యం. నీకు జగన్నాథరావంటే ఉన్న ద్వేషంతో అతని చెల్లెలి జీవితం నాశనం చేసి పగదీర్చుకోదలుచుకున్నావన్నమాట! ఛు. ఎవరు క్షమించినా భగవంతుడు నిన్ను క్షమించడు" అంటూ శపించి, నే నింకా మూర్ఛతేరకముందే, బిల్లు మాటకూడా ఎత్తకుండా చక చక నడిచిపోయేడు.

ఇంటి కొచ్చేస్తుంటే ఆలోచించేను- మాటమీద మాటొచ్చి ఇంత గొడవ చేశాను కాని, ఈ అమ్మాయి నా గర్భశత్రువు చెల్లెలని నాకేం తెలుసు? అసలా జగన్నాథరావో పొగరుబోతు. కాలేజ్‌లో చదువుకొనే రోజుల్లో వీడో పెద్ద రొమాంటిక్ హీరో అని పేరు. కాస్తో కూస్తో వీడని ప్రేమించని ఆడది లేదని ప్రతీతి. వీడో సంఘ సంస్కర్తనీ, దేశాన్నుద్ధరించడానికే పుట్టాడనీ, ముందు ముందు నెహ్రూ అంతటి వాడవుతాడని వాదించేవాళ్ళు లేకపోలేదు. అసలు మరో సంగతేమంటే.... నేను ఫైనలియరు చదువుకునే రోజుల్లో ఓ సారి నా గదిలో దొరబడి చూడు మిస్టర్! మీవాళ్ళు, పదివేల కట్నం యిస్తే నీకు మా చెల్లెల్నిచ్చి పెళ్ళి చెయ్యడాని కొప్పుకుంటానన్నారట. జైలు కెళ్ళే సరదాతో వాళ్ళలా అన్నారేమో తెలీదుకాని కట్నం యిచ్చి మొగుణ్ణి కొనుక్కునే దుస్థితికి మా చెల్లెలింకా దిగజారలేదు" అంటూ కళ్ళురిమి చక్కాబోయాడు. జగన్నాథరావు మా ఆవిణ్ణి కాదని మరొకర్తిని కట్టుకున్న తర్వాత, మావాళ్ళూ మా అత్తారూ కూడా, మా పెళ్ళిలో జగన్నాథరావుని ఐక్య కంఠంతో తిడుతూ మీ కెంతగండం గడిచిందంటే మీ కెంతగండం గడిచిందని ఒకళ్ళ నొకళ్ళు పరామర్శించుకున్నారు.

మా పెళ్ళయిన తర్వాత, మాటల సందర్భంలో మా ఆవిడ అతని గుణగణాన్ని పొగుడుతూ పరవశమయినప్పడల్లా నాకు అరికాలిమంట తలకెక్కేది. అంత అసహ్యించుకోవల్సిన దుర్గుణాలతనిలో వున్నాయని కాకపోయినా అసలు కారణం నాలో దాగివున్న అసూయనుకుంటాను. మా ఆవిడ సౌశీల్యంలో నాకు పరిపూర్ణ విశ్వాసమున్నా, అతన్ని ప్రేమించినంత గాఢంగా నన్నూ ప్రేమిస్తుందా అన్న సందేహం నన్నెన్నోసార్లు కలతబెట్టింది.

నే నిల్లు చేరేటప్పటికి మా సమావేశం తాలూకు వివరాలు తన కవితా మాధుర్యంతో రంగరించి, మా బావ ఫోన్‌లోంచి మా ఆవిడ చెవిలోకి నూరిపోసి వుంటాడు. అది నేపాళ మాత్రలాగ పనిచేసి నేను వెళ్ళగానే మా ఆవిడ సింహ

గర్జన చేస్తూ నా మీద రణరంగంలోకి లంఘిస్తుందా లేకపోతే నల్లమందులాగ పనిచేసి బిక్కముఖారవిందంతో ముక్కుపుటా లెగరేసుకుంటూ, కిక్కురుమన కుండా తన అక్కసునంతా దిగమింగి "గ్యాస్ సిలిండర్" లాగ టెన్షన్‌లో ఉంటుందా? చక్కటి చుక్కలాంటి సంధ్య నన్ను ప్రేమించిందని విని ఎంత అసూయపడుతుందో? తనేదో అందగత్తెనని కాకపోతే నన్నే ఆడదీ ప్రేమించ దనుకుంటుందా!

ఇంతకీ అసలు ప్రమాద మేమిటంటే మా ఆవిడ్ని పెళ్ళాడ లేదని కోపం లేదు సరికదా, మా బావమరిదాధముడికి జగన్నాథరావంటే చచ్చేటంత ప్రేమ. ఇప్పుడు పిఁచెళ్ళి ఆ జగన్నాథరావుతో ''మీ చెల్లెలి నడతేం బాగాలేదు. ఒళ్ళు దగ్గిర పెట్టుకుని బతకమను'' అంటూ ఉచిత సలహా యిచ్చేడా, వాడసలే రౌడీ! లాంగ్‌జంపులు చేసుకుంటూ ఎగాయికిని మా యింటి కరుదెంచి నా కాలరు పట్టుకుని ఉచితరీతిని రెండుతుకులుతుకి సత్కరించావచ్చు. అసలు వార ఫలాల్లో గృహకలహం, శత్రుభయం, అశాంతి అని రాసే వుంది. బుద్ధిః కర్మానుసారే- చూసి చూసి దారినిపోయే కొరివితో తల గోక్కున్నాను. దీనికంతకీ కారణం ఆ సంధ్య నాకు కనబడి నమస్కారం చెయ్యడం. దాని మహత్యమే ఈ రభసంతాను.

* * *

గుమ్మంలో అడు గెట్టగానే హాల్లోంచి ఏవో పెళ్ళి ప్రేమా అంటూ మాటలు వినబడ్డాయి. మా ఆవిడతో మాట్లాడుతున్న దెవరా అని ఆలోచిస్తూండగా కాళ్ళు చల్లబడ్డాయి. శక్తినంతా కూడగట్టుకుని శరీరాన్ని వరండా వరకూ మోసుకెళ్ళి స్తంభానికి ఘటాన్ని జారేశాను. లోపల్నించి మాటలు వినబడుతున్నాయి.

''మరి నే వెడతాను.''

''ఇంకా స్సేపు కూర్చోకూడదూ?''

''మీ ఆయన ఎప్పుడొస్తాడో ఏమో.''

''సరే వెళ్ళు. వెళ్ళి అన్నీ సిద్ధంచెయ్యి?''

''మీ ఆయన ఒప్పుకుంటాడా! మన జీవితాలు అంత సుఖప్రదంగా దొర్లించుకునే అవకాశముందని నాకు నమ్మకం లేదు.''

''నాకు నమ్మకం వుంది. జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇద్దరి ప్రేమ జీవుల జీవితాలు దగ్ధంచేసి ఆయన ఏం బావుకుంటారు?''

''ఒప్పుకోకపోతే?''

''ఒప్పుకోకపోతే అడ్డేదేమి లేదు. ఇద్దరికోసం ఒకళ్ళు చెయ్యలేని త్యాగాన్ని ఒకడికోసం యిద్దరు చెయ్యాలనేముంది?''

''నీ కున్న నమ్మకం నాకు లేదు. పెళ్ళి నువ్వనుకున్నంత సులభంకాదు. ఇటు మీ తల్లితండ్రులూ, అటు మీ ఆయనా, పైగా, వాళ్ళ తల్లిదండ్రులూ.... ఇన్ని ప్రతిబంధకాల్ని ప్రతిఘటించాలి.''

"అన్నిటికంటే ముఖ్యం మా ఆయన ఒప్పుకోడమే కదా! ఆయన రాగానే యిప్పుడే తేల్చేస్తాను. నువ్వు కూడా కాస్సేపు ఆగకూడదూ! వచ్చే వేళ యింది కూడాను.''

''అలాంటి సాహసం చెయ్యకు. నీకు చిన్నప్పట్నుంచీ ఆవేశం ఎక్కువ. శాంతంగా మంచి మాటల్తో ఒప్పించటానికి ప్రయత్నించు నేను వెడతాను. అతని ధోరణి సుముఖంగా వుంటే ఫోన్ చెయ్యి. తర్వాత నేను మాట్లాడుతాను. వస్తాను. గుడ్‌నైట్!''

''గుడ్‌నైట్!''

ఎంత సాహసం! ఎంత దారుణం! ఎంత ఘోరం!!! అర్నెళ్లపట్టి నాతో కాపురం చేస్తున్న మా అవిడ జగన్నాథరావుతో లేచిపోయి పెళ్ళిచేసుకుంటుందా? దీనికి నేనొప్పుకోవాలా? దీనికి బుద్ధి లేకపోతే వాడికీ బుద్ధుండద్దూ? అటు కట్టుకున్న పెళ్ళాం గొంతుకోక్కని, ఇక్కడ నా పచ్చటి కాపరంలో చిచ్చుపెడతాడా? ప్రేమ జీవులట. కామపశువులు. దీని కంతకీ కారణం ఈ ప్రేమరోగం. ప్రేమించడమో కళ. ప్రేమించి పెళ్ళాడటమో పేషన్. పెళ్ళాడిన తర్వాత ప్రేమించుకోవడమో చాతగాని తనం. ప్రియురాలూ, భార్యా ఒకర్తే అయిన మొగాడూ, ప్రియుడూ, భర్తా ఒకడే అయిన ఆడదీ శుద్ధ దద్దమ్మల్లో జమ. ఈ సిద్ధాంతాన్ని ప్రబోధిస్తూ బోలెడు సినిమాలు, కావల్సినంత సాహిత్య సంపద. పెళ్ళికాని పిల్ల గర్భవతవ్వడం, పెళ్ళయిన స్త్రీ బలవంతం చెయ్యబడటంలాంటి అదర్శాలు లేని సినిమాలు సినిమాలు కావు. పేజీకోసారయినా ప్రేయసీ ప్రియులూ ఒకళ్ళ ఒళ్ళో

ఒకళ్ళు వాలిపోవడం మొదలయిన రసవత్తరమైన దృశ్యాలతో లైంగిక విజ్ఞానాన్ని ప్రచారం చెయ్యని సాహిత్యం సాహిత్యమే కాదు. ఈ సినీకళోద్ధారకుల దృష్టిలో ఈ సాహితీ సేవాదురంధురుల దృష్టిలో మానవ జీవితాలకి ఏకైక సందేశం-ప్రేమ. వావి, వరస, వయస్సు విస్మరించి స్త్రీ పురుష లొకళ్ళ నొకళ్ళు కామ చక్షువుల్తో చూసుకోవడమే నేటి సంస్కారం! ఇప్పుడు నా బతుకేంగాను? నా భార్య యింకొకడితో లేచిపోవడమా? ఎంత అప్రతిష్ఠ? ఎంత అవమానం? ఇలా మనుష్యుల్ని నరపశువులుగా మార్చిన ఏ సినిమా ప్రొడ్యూసరూ లేక డైరెక్టరూ, ఏ రచయిత లేక రచయిత్రి నన్నిప్పుడు రక్షిస్తారు?

"ఏమండీ, ఏమిటండీ ఆ చూపు? ఇలా యీ మూల కూర్చున్నారేమిటి? ఎప్పుడొచ్చా రింటికి?" అంటూ గుక్క తిప్పకోకుండా ప్రశ్నలు వేస్తూ మా ఆవిడ నా భుజం పట్టుకుని కుదపగా మళ్ళీ ఈ లోకంలో పడ్డాను. కాని, ఎంత ప్రయత్నించినా నోరు విడలేదు. ఏం సమాధానం వొచ్చి గుండె ఆగిపోతుందోనని భయం అనుకుంటాను. నా నోరు స్వాధీనం లేకుండా పోయింది.

"ఏమిటండీ అలా వున్నారేం? అసలు ఏం జరిగింది? అదుగో ఘుమ ఘుమ లాడుతున్నారు ఏ పార్టీకో వెళ్ళేరు. మరిచిపోయేను, మా అన్నయ్యతో వెడతానన్నారుగా, ఇంక ఈ వీధిలో భాగోతం చాలు. లేవండి" అంటూ రెండు జబ్బలూ పట్టుకు లాగుతుంటే ఆ చేతులుకేసి చూశాను. యిన్నాళ్ళూ యెంత బలాన్నీ, యెంత ధైర్యాన్నీ ఇచ్చేయి. అవి చేతులు కావు-వజ్రాయుధాలు. అవి నా చెంతనున్నంతవరకూ అజేయుణ్ణి. ఇక అవి నాకు దూరమయిపోతాయి.

"ఏమండీ! ఏమిటా వెర్రిచూపూ? ఏమయిదండీ? ఏమయినా దుర్వార్త వచ్చిందా? మీ ఆఫీసరేమయినా అన్నాడా? మీ ఉద్యోగం పోయిందా? మీ రెవర్నైనా ఖూనీ చేశారా? దేనికీ సమాధానం చెప్పరేమండీ?" అంటూ నేను కాదని తలూపుతున్నకొద్దీ ప్రశ్నలు వేసుకుంటూ పోయింది.

చివరి కిక్కడ కూర్చోవడ మేమిటి లోపలి కెడదామంటూ చేతులు పట్టుకుని లేవదీసి నడిపిస్తూ లోపలికి తీసుకెడుతుంటే శరీరం కొద్దిగా స్వాధీనంలోకి రావడం మొదలెట్టింది. పెదవులు తడి చేసుకుని 'రాజీ' అన్నాను.

"ఓయ్! ఏమిటి మీబాధ? ఉండండి. డాక్టర్‌కి ఫోన్ చేస్తాను'' అంటూ మంచంమీద కూలేసి లేవబోయింది.

"ఒద్దు. నువ్వు నన్ను విడిచి పెట్టకు" అన్నాను ఆమె చేతులు పట్టుకుని.

"పోన్లెండి. ఇక్కడే వుంటాను ఇప్పుడు చెప్పండి" అంది అనునయంగా.

"అదికాదు రాజీ! నువ్వు నన్ను విడిచిపెట్టి వెళ్ళి పోదామనుకుంటున్నావు కదూ" సూటిగా మొహంలోకి చూడలేక గాజులు సవరిస్తూ అడిగేను.

"వెళ్ళనులెండి, ఇక్కడే కూర్చున్నానుగా."

"నిజం చెప్పు. నన్ను విడిచిపెట్టి ఆ జగన్నాథరావుతో లేచిపోదామనుకుంటున్నావు. అవునా?" అన్నాను. 'అవును' అని సమాధానం వస్తే యేం చెయ్యాలో ఆలోచిస్తూ.

"ఏమండీ. ఏమిటీ ధోరణి. ఇలా చూడండి. ఇవ్వాళేం వారం. పోనీ ఇవెన్ని వేళ్లు." అంటూ నా మొహం ముందు మూడువేళ్ళు అటూ యిటూ ఆడిస్తూ నా మొహంలోకి పరీక్షగా చూసింది.

"నిజం చెబుతున్నా రాజీ. ఆ సంధ్యని నే నెరగను. ఆ అమ్మాయి జగన్నాథరావు చెల్లెలని నాకసలు తెలీదు. ఆ అమ్మాయితో నాకేదో సంబంధం వుందని నువ్వనుకున్నావు. దీనికి సాయం మీ అన్నయ్యకూడా దబాయించేటప్పటికి పౌరుషమొచ్చి ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని అబద్ధమాడేను. దానికింతగా శిక్షిస్తావా?" అన్నాను ప్రాధేయపూర్వకంగా ఆమె రెండు అరచేతుల్నీ నా చెంపకు చేర్చుకుంటూ.

"పాపం! మీ మనస్సెంత బాధపెట్టేను. ఇప్పుడే జగన్నాథం అన్ని విషయాలూ చెప్పేడు. తప్పంతానాదే. మిమ్మల్ననవసరంగా అనుమానించేను. ఏదో భార్యా భర్తా అయిన తర్వాత పేచీపడితే పడతాం మీ రాజీతో రాజీ చేసుకోడం ఎంతసేపూ? దానికోసం దేవదాసులాగ, ఇంటికొచ్చి నన్నల్లరి పెడతారా, నన్ను హడలగొట్టాలంటే యిదా మార్గం?" అంది కంట నీరుబెడుతూ. ఎందుకో యీ అబద్ధం, ఈ నటన?

''ఇంకా ఎందుకు నిజం దాస్తావు? నేనంతా విన్నాను.''

ఇందాకా అతను వెళ్ళబోయేముందర పెళ్ళికి సిద్ధం చెయ్యమనడం, నన్నొప్పిస్తాననడం....'' అంటుంటే నా నిస్సహాయతకి నామీద నాకే జాలేసింది.

''ఇంకా ఏం విన్నారు?'' అంది చిరునవ్వు నవ్వుతూ. ఎంత గుండె నిబ్బరం?

''ఇంకా స్సేపు ఆగితే ఆయన రాగానే అడిగి తేల్చేస్తా నన్నావు.''

''అవును అన్నాను. ప్రేమోచోటా పెళ్ళోచోటా అయితే ఇద్దరి జీవితాలు నాశనమయిపోతాయి'' అంది మొహంలో అదే చిరునవ్వు - ఎంత ధైర్యం!

"నన్నెందుకు ప్రేమించలేవు రాజీ? ఏం తప్పు చేశాను? నిన్ను ప్రాణ ప్రదంగా ప్రేమించానే! నిన్ను విడిచి బ్రతకలేనని నీకు తెలియదా? నన్నన్యాయం చెయ్యకు. నువ్వు నా భార్యవు మాత్రమే కావు- నా దేవతవి. నా సర్వస్వానివి. నా ఆశాజ్యోతివి. నువ్వు లేకపోతే నేను బతకలేను. నన్ను విడిచిపెట్టకు రాజీ! నన్ను విడిచిపెట్టకు..." కట్టలు తెంచుకున్న ఉద్రేకంలో ఇంకా ఏమిటేమిటో అన్నాను.

"ఇప్పుడు కాదుకదా, జన్మ జన్మాలకీ మిమ్మల్ని విడిచిపెట్టను. కిందటి జన్మలో ఏం పుణ్యం చేసుకున్నానో యీ జన్మలో మీలాంటి దేవుణ్ణి భర్తగా పొందాను. ఏ భార్యా తన భర్తనుంచి ప్రత్యక్షంగా వినడానికి నోచుకోలేని తియ్యని మాటలు మీ నోటంట వినే అదృష్టం, ఆనందం, గర్వం, సంతృప్తి భగవంతుడీవిధంగా ప్రసాదించేడు" అంది నా కౌగిలిలో తల దాచుకుంటూ.

"రాజీ!" అంటూ ఈ మధురానుభూతి స్వప్నం కాదని రుజువు చేసుకోడానికి మా ఆవిడ తల నా గుండె కదుముకున్నాను.

"అసలు సంగతి తెలియక మీరు పడే బాధను నేను భరించలేను. మీరు విన్న మాటలన్నీ నిజమే. కాని, అవి మా అన్నయ్యా, సంధ్యా పెళ్ళిగురించి, ఈ మధ్యనే వాళ్ళిద్దరికీ పరిచయమై - ప్రేమలో పడ్డారు,"

"మీ అన్నయ్యా, సంధ్యా ప్రేమించుకున్నారా?!" అన్నాను ఆశ్చర్యంగా. అప్పుడర్థమయింది- మా బావమరది దగ్గర ఆ అమ్మాయి ఫోటో ఎలా వచ్చిందో.

''అవును, ఈ విషయం తెలుసుకుని మా నాన్నగారు మండిపడుతూ, 'ఆ జగన్నాథరావు ఇటు మన కుటుంబాన్నీ అటు మీ బావనీ అవమానించేడు. అలాంటివాడి చెల్లెల్ని పెళ్ళాడతానంటే నేను ఒప్పుకున్నా మీ చెల్లెలూ, బావా, అతని తలిదండ్రులూ నీ మొహం తగలేస్తారు - నేను తలెత్తుకు తిరగాలంటే మళ్ళీ యీ సంబంధం మాటెత్తకు' అని కేకలేశారుట ఇది విని ఆ అమ్మాయే మనతో ముఖాముఖీ మాట్లాడుదామనుకుని మన ఎడ్రస్ తెలుసుకుని, మా అన్న

య్యకి కూడా చెప్పకుండా నిన్న మనింటికొచ్చింది. మన ఇల్లు తాళంవేసి వుందిట. మన ఇంటిముందు నిలబడ్డంచూసి ఈ వీధిలో వాళ్ళే ఎవరో మీ రూపురేఖల్నీ వేసుకున్న బట్టల్నీ వర్ణించి ఇప్పుడే బస్‌స్టాండులో చూశానని చెప్పేరుట. అందుకే గబగబ వచ్చి బస్ఎక్కి మిమ్మల్ని ఆనవాలుపట్టి పలకరించింది...."

"మరి సినిమాలో ఎలా ప్రత్యక్ష మయింది?"

"మీరు దిగిపోడం చూసి, ఇంక నడిరోడ్డుమీద మాట్లాడ్డం ఎందుకు, సాయంత్రం మళ్ళీ యింటికొచ్చి మాట్లాడదామనుకొని దార్లో స్నేహితులు అడ్డగిస్తే దిగి మనలాగే మ్యాటినీకొచ్చింది. పాపం, ఏమనుకుందో ఏమిటో నా పేలాపన విని! సినిమాలో లైట్లార్పేసేరు. దానికి సాయం మీరు నా నోరు మూసేసేరు కనక సరిపోయింది. లేకపోతే ఎంత అప్రతిష్ట! నోటికొచ్చినట్లల్లా వాగేను. తనే మళ్ళీ మనింటికొస్తానంటే 'నువ్వు రావడం ఎందుకూ! మీ తాలూకు మొగాళ్ళెవరేనావుంటే నన్నొచ్చి కలుసుకోమను' అన్నాను కదా, అదే నిజమనుకుని వాళ్ళన్నయ్య జగన్నాథాన్ని ఇందాక పంపింది మనింటికి. అమాయకురాలు. నిజానికి జగన్నాథానికి సంధ్య అనే చెల్లెలుందని విన్నాను కాని చూడలేదు. అప్పట్లో వాళ్ళ వాళ్ళెవరూ యీ వూళ్ళోలేరు. అతను హాస్టల్లోవుండి చదువుకునేవాడు. ఇంతకీ తన పేరు చెప్పగానే ఆనవాలుపట్టి వేళాకోళం చేస్తున్నారనుకుని వుంటుంది. నే నన్న మాటలు సరిగ్గావింటే ఎంత బాధపడేదో ఏమిటో!'' అంది తన కాబోయే వదినగారిని గురించి తలుచుకుని మురిసిపోయే తన్మయత్వంలో.

నా సందేహాలన్నీ మంచుతెరల్లాగ విడిపోయినమాట నిజమేకాని, అంతక్రితమే నేను మా బావతో చెప్పిన అబద్ధాల ఫలితంగా మరో క్రొత్త తుఫాను చెలరేగుతుందేమోనన్న భయం మాత్రం ఘనీభవించింది.

''ఏమండీ! అలా ముభావంగా ఉన్నారు? ఈ పెళ్ళికి మీ రొప్పకుంటారని జగన్నాథానికి అభయహస్తమిచ్చేను. మొదట్లో అతనే వొచ్చి అడిగితే మీ రవమానించి పొమ్మంటారన్న భయంతో రాలేదుట'' అంది నా మౌనంచూసి, ఆ విషయమే ఆలోచిస్తున్నా ననుకుని.

''నువ్వుమాటిచ్చేసేక నేను కాదంటే మాత్రం నా మాట నెగ్గనిస్తావా?'' అన్నాను దగ్గరకు తీసుకుంటూ.

ఇంతలోకే టెలిఫోన్ ప్రళయగర్జన వినగానే మళ్ళీ చెమట్లు పట్టడం ప్రారంభించేయి. మా ఆవిడే హాల్లోకి వెళ్ళింది. 'ఓ!....అన్నయ్యా! నువ్వా!' అనడంతోటే ఈ అవమానం గండం గడిచే దెలాగ భగవంతుడా అనుకుంటుండే మళ్ళీ మా ఆవిడ గొంతు వినబడింది. 'ఓ! అదా? నిన్నేడిపించడానికలా అన్నారుట! ఇంటికొచ్చి ఏదో ఘనకార్యం చేసినట్టు నాతో చెప్పి పెద్ద నవ్వులు! ఇంటికొచ్చి ఓ గంటయింది. ఇప్పుడే నాన్నగారికి టెలిఫోన్ చేసి, నీ పెళ్ళికి ఒప్పుకోమని చెబుదామనుకుంటున్నారు అయినా ఏమిటో, అర్థంలేని మనిషి! ఎంత ప్రమాదమైన సరసం!....ఇంకా నయం. ఆ వేడి మీదెళ్ళి ఆ అమ్మాయితో దెబ్బలా టెట్టుకున్నావుకావు. అయినా, నువ్వేలా నమ్మావు. ఆయనకి ప్రేమేమిటి నా మొహం? ఆయన్ని ఏ ఆడది...."

ఇంక ఆ మాటలు వినబడకుండా రేడియో ట్యూన్ చేసి వాల్యూం పెంచి సావకాశంగా సిగరెట్ వెలిగించేను. *